క్లుప్తంగా

డీఎస్పీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సోమశిల : అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సైలు సూర్యప్రకాష్‌రెడ్డి, అనూష, ఏఎస్సై మస్తాన్ ఉన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు నేతృత్వంలో ప్యానసోనిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, టీవీఎస్, అపోలో ఫార్మసీ తదితర సంస్థలు తమకు కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 70 మందికిపైగా అభ్యర్థులు హాజరు కాగా, 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయూం వివరించారు.

అల్లూరు జాతరకు తొలి చాటింపు



అల్లూరు : ఎంతో ప్రసిద్ధిగాంచిన అల్లూరు ఊరు పోలేరమ్మ, గంగమ్మ, కలుగోళమ్మ గ్రామోత్సవాల జాతరకు స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద మంగళవారం తొలి చాటింపు వేశారు. డిసెంబర్ 31వ తేదీ జరుగనున్న గ్రామోత్సవానికి తొలుత ఆసాధులు ప్రత్యేక పూజలు నిర్వహించి చాటింపు కార్యక్రమాన్ని జరిపించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని జాతరకు సంబంధించి ప్రతి కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచించారు. గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కొండయ్యస్వామికి పొంగళ్ల సమర్పణ



మర్రిపాడు : మండలంలోని చుంచులూరు గ్రామంలో అంకమ్మ, మల్లెంకొండేశ్వరస్వామి తిరునాళ్ల ముగింపు సందర్భంగా మంగళవారం భక్తులు పొంగళ్లు సమర్పించారు. నిర్వాహకులు భక్తులందరికీ సామూహిక విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ తిరునాళ్ల మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పెన్షనర్లకు సన్మానం



కావలి : స్థానిక ఫైర్ స్టేషన్ రోడ్డులో ఉన్న పెన్షనర్ల భవనంలో ఆలిండియా పెన్షనర్స్ డే మంగళవారం జరిగింది. కావలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పెన్షనర్లకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం 75 ఏళ్లు నిండిన 20 మంది పెన్షనర్లను సన్మానించారు. డీఎస్పీ పి.శ్రీధర్ పాల్గొని, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య, సహాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి ఆదిశేషులు, ట్రెజరర్ వెంకయ్య పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

చేజర్ల : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పోక్సో చట్టంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంగం సీఐ వేమారెడ్డి పాల్గొని, పోక్సో చట్టంలోని ప్రత్యేక విధి, విధానాల గురించి వివరించారు. తల్లిదండ్రులు సైతం జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై తిరుమలరావు, హెచ్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. భద్రతే శరణ్యం

- రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు
- పారిశుద్ధ్య పరిరక్షణపై దృష్టి సారించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు

కావలి : ఓ వైపు చల్లని వాతావరణం.. మరోవైపు పాటు రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో తీవ్రమైన పారిశుద్ధ్య సమస్యలు నెలకొని ఉంది. దీంతో దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. కాగా కావలి పట్టణంతో పాటు గ్రామాల్లో కూడా జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించి తగిన వైద్యం పొందాలంటున్నారు. ప్రస్తుతం కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

లోపించిన పారిశుద్ధ్యం

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది. వారం రోజుల నుంచి చెదురుమదురుగా పడుతున్న వర్షాలకు అడుగంటిన బావుల్లో కొత్తనీరు చేరడంతో పాటు, కాలువలు, వీధుల్లో మురుగునీరు మడుగులు కడుతున్నాయి. తాగునీటి కాలుష్యం, వాతావరణ మార్పులు, దోమలతో జలుబు, జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఏ పంచాయతీలో చూసినా వీధుల్లో చేరిన చెత్తకుప్పలు, పేడ దిబ్బలు, కాలువల్లో మందుకు కదలని మురుగునీరు, తాగునీటి బోర్లు, కుళాయిల వద్ద అపరిశుభ్ర నెలకొంది. కావలి పట్టణంతో పాటు రూరల్, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లోని పలు పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్, వైకుంటపురం, పాతూరు, ఇస్లాంపేట తదితర ప్రాంతాలతో పాటు మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఇటీవల కావలి రూరల్ మండలం సర్వాయపాళెం పంచాయతీలో అతిసార ప్రబలిన విషయం తెలిసిందే. అయినా అధికారుల్లో మార్పు రావడం లేదు.

నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలి



ఇంటి పరిసరాలతో పాటు పాతటైర్లు, డ్రమ్ములు, పగిలిన కుండల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తలు వహించాలి. దోమ తెరలు వాడాలి. జ్వరం వచ్చిన తర్వాత సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎ.అనిల్‌కుమార్, వైద్యాధికారి, తుమ్మలపెంట పీహెచ్‌సీ

రక్షిత నీటిపై అలక్ష్యం



అల్లిగుంటపాళెంలో చెట్ల పొదల్లో తాగునీటి ట్యాంక్

కావలి పట్టణంలో 40 వార్డులు ఉండగా, నియోజకవర్గంలో మొత్తం 62 పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీలు, ఆవాస ప్రాంతాల్లోని ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు 94 ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, 235 మినీ ట్యాంక్‌లు ఉన్నాయి. ఈ పథకాల ద్వారా ఒక్కో వ్యక్తికి రోజుకు 55 లీటర్ల వంతున రక్షిత నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ప్రతి 15 రోజులకు క్లోరినేషన్ చేయడంతో పాటు ఓవర్‌హెడ్, మినీ ట్యాంక్‌లను శుభ్రం చేయాల్సి ఉంది. చాలా చోట్ల ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్ ఊసే లేదు. పలుచోట్ల పైపులైన్ల లీకేజీల కారణంగా మురుగునీరు రక్షిత నీటిలో కలుస్తుంది. అధికారులు స్పందించి రక్షిత నీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రతి దుకాణాన్ని సందర్శించాలి

వరికుంటపాడు : ఎంఎస్‌ఎంఈ సర్వేకు సంబంధించి సచివాలయ ఉద్యోగులు ప్రతి దుకాణాన్ని సందర్శించి వివరాలు నమోదు చేయాలని ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను ఆయన మంగళవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సర్వేను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కలిగిరి : మండల కేంద్రమైన కలిగిరిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని కలిగిరి ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్ జలీల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో ఈ ఏడాది 12 కేసులు నమోదు చేసి 152 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఉదయగిరి : మండలంలోని శకునాలపల్లి ప్రాథమిక పాఠశాలలో వైద్యారోగ్య సిబ్బంది మంగళవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయా వివరాలను ఆరోగ్య రికార్డుల్లో నమోదు చేశారు. ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, హెచ్‌ఎం కె.రాజేశ్వరి, ఏఎన్‌ఎం చంద్రకళ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై జాప్యం తగదు



మాట్లాడుతున్న గొల్లపల్లి శ్రీనివాసులు

ఉదయగిరి : ఎస్సీ వర్గీకరణకు న్యాయస్థానాల్లో తీర్పు వచ్చినప్పటికీ జాప్యం తగదని, దీనిపై పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాసులు అన్నారు. ఉదయగిరిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నేతలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఎస్సీ వర్గీకరణ జరగకుండా కొందరు కుట్రలు చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరిగే మంద కృష్ణ మాదిగ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వివిధ మండలాలకు సంబంధించి ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిలను ప్రకటించారు. దుత్తలూరుకు యద్దనపూడి రమణయ్య, సీతారామపురానికి బెజవాడ బాలగురవయ్య, ఉదయగిరికి గొల్లపల్లి మోహన్, వరికుంటపాడుకు గంగపట్ల సింహాద్రిని నియమించారు. సమావేశంలో జాషువా, ఎల్.అశోక్‌కుమార్, అంబేడ్కర్, తాతపూడి డేవిడ్, గున్నా బాబు, వడ్లపల్లి తిరుపతి పాల్గొన్నారు.


మందుల కోసం వచ్చి.. కుప్పకూలి..



హసన్ మృతదేహం

ఆత్మకూరు : మందులను కొనుగోలు చేయడానికి మెడికల్ షాపునకు వచ్చిన ఓ వృద్ధుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూరు పట్టణంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అనంతసాగరానికి చెందిన మట్టి హసన్ (70) అనారోగ్య సమస్యలతో మంగళవారం పట్టణానికి వచ్చారు. బీఎస్సార్ సెంటర్ వద్ద ఓ మెడికల్ షాపు వద్దకు వెళ్లి కావాల్సిన మందుల గురించి వివరిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. సమీపంలోని వారు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అదే సమయంలో అతని మొబైల్‌కు బంధువులు ఫోన్ చేశారు. పక్కనున్న వారు ఫోన్ తీసి మృతిచెందిన విషయాన్ని తెలపడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. వెంటనే ఆత్మకూరుకు చేరుకున్నారు. ఆయనకు గుండె సంబంధిత వ్యాధి ఉందని, తీవ్ర గుండెపోటుకు గురై మృతిచెంది ఉంటాడని వారు తెలిపారు.

ఎరువుల యాజమాన్యంతో లాభాలు



ఆత్మకూరురూరల్ : మహిమలూరులో సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ



మర్రిపాడు : మాట్లాడుతున్న ఏఓ రామ్మోహన్



అనుమసముద్రంపేట : అధికారుల క్షేత్ర సందర్శన



వరికుంటపాడు : పంటలను పరిశీలిస్తున్న ఏఓ

ఆత్మకూరురూరల్ : రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలని, దీనివల్ల అనేక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కిశోర్‌బాబు అన్నారు. మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. జీవన ఎరువులతో పాటుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. మాస్టర్ ట్రైనర్ వెంకట లక్ష్మి, ఎంపీఈఓ నవాజ్, వీఏఏ బేబీ ఆయేషా పాల్గొన్నారు.

- **మర్రిపాడు :** మండలంలోని బూదవాడ, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల ఏఓ రామ్మోహన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న వరిపంటను పరిశీలించి కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు ఉన్నట్లు గుర్తించి వాటి నివారణ చర్యలు వివరించినట్లు తెలియజేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ గురుజయంతి, ఎల్ఎస్ఏ పెంచలరావు, ఉద్యానాధికారి సీహెచ్ రాజశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, వీఏఏలు మల్లికార్జున, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- **అనుమసముద్రంపేట :** ఏఎస్‌పేట మండలంలోని గుంపర్లపాడు, వేల్పులగుంట గ్రామాల్లో మండల ఏఓ రజనీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మినుము, వరి పైర్లలో సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈనెల 30లోపు వరిపైరుకు బీమా చేయించుకోవాలని తెలిపారు. ఏఈఓ చిరంజీవి, వీఏఏలు శ్రీనాథ్, జి.హేమంత్ పాల్గొన్నారు.
- **వరికుంటపాడు :** రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల ఏఓ రవికుమార్ అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతులు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు.
- **కావలి :** రూరల్ మండలంలోని చెన్నాయపాళెం, పెదపట్టపాళెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కావలి ఉద్యానాధికారి సుధామయి రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు.
- **ఉదయగిరి :** వాతావరణ మార్పుల కారణంగా వరిలో వివిధ తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ ఆంజనేయులునాయక్ తెలిపారు. మండలంలోని గుడినరవలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వరిపైరును ఆయన పరిశీలించారు. వరిసాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

40 శాతం సబ్సిడీపై డ్రోన్ల సరఫరా

వరికుంటపాడు : ప్రభుత్వం మండలానికి రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్లను 40 శాతం సబ్సిడీపై ఇస్తోందని, ఆసక్తి ఉన్న రైతులు ముందుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు గ్రూపులుగా ఏర్పడాలన్నారు. వారికి రెండు వారాల పాటు డ్రోన్ శిక్షణను ఉచితంగా కల్పించి సర్టిఫికెట్‌ను కూడా మంజూరు చేస్తామని తెలియజేశారు.

నేడు ఆత్మకూరుకు మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు : ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విక్రమ్‌రెడ్డి సమావేశమవుతారని పేర్కొన్నారు. తొలుత చేజర్ల మండలం గాలిపాళెంలో పోలంరెడ్డి పుల్లారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి 10.30 గంటలకు పట్టణానికి చేరుకుంటారని వివరించారు.

సోమశిల దక్షిణ కాలువ చైర్మన్‌గా కేశవచౌదరి

చేజర్ల : స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన సోమశిల దక్షిణ కాలువ ఎన్నిక ఏకగ్రీవమైంది. చైర్మన్‌గా వేలూరి కేశవ చౌదరిని, వైస్ చైర్మన్‌గా చల్లా విజయభాస్కర్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సోమశిల ప్రాజెక్ట్ దక్షిణ కాలువ ఈఈ మల్లికార్జున వ్యవహరించారు.

కేంద్ర బృందం రాక నేడు

వింజమూరు(ఉదయగిరి) : కేంద్ర జలశక్తి అభియాన్ బృందం బుధవారం వింజమూరు, చాకలికొండ గ్రామాల్లో పర్యటిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నీటి కుంటలను పరిశీలిస్తారని వివరించారు.

జిల్లా కబడ్డీ జట్టుకు కావలి విద్యార్థిని



ముఖేశ్వరి

కావలి : జిల్లా బాలికల కబడ్డీ జట్టుకు కావలి విద్యార్థిని ఆవుల ముఖేశ్వరి మంగళవారం ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా తముక్కల గ్రామానికి చెందిన ముఖేశ్వరి పట్టణంలోని శ్రీమేధా జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. పట్టణంలోని క్రీడా మైదానంలో జరిగిన జిల్లా కబడ్డీ జట్టు ఎంపికలో ఆమె స్థానం సాధించారు. దీంతో కళాశాల కరస్పాండెంట్ పి.జానకిరామ్ విద్యార్థినిని అభినందించారు.

ఉపాధి పనుల పరిశీలన

ఉదయగిరి : జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉదయగిరి పంచాయతీలో జరుగుతున్న పనులను ఏపీఓ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. కూలీల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలకు ఎక్కువ వేతనాలు పడేందుకు అనుసరించాల్సిన విధానాల గురించి సూచనలు, సలహాలిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



సంగం : మండలంలోని పెరమన మెయిన్, జంగాలదొరువు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ సునీలత, సూపర్‌వైజర్ పద్మావతి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్కర్లు, సహాయకులు సమయపాలన పాటించాలని సూచించారు.

పెరిగిన చలి తీవ్రత

బిట్రగుంట : బోగోలు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి చలితీవ్రత ఒక్కసారిగా పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై చలి వాతావరణం నెలకొంది. మరోవైపు తీరంలో అలల ఉధృతి కూడా స్వల్పంగా పెరిగింది. ఉదయం 11 నుంచి అలల ఉధృతి క్రమంగా పెరుగుతూ వస్తోందని మత్స్యకారులు తెలిపారు.

సంపూర్ణాభివృద్ధి సాధనే లక్ష్యం



ఆత్మకూరురూరల్ : మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు రమేష్



సీతారామపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్



ఉదయగిరి : మాట్లాడుతున్న ఏపీఎం ఖాజారంతుల్లా

ఆత్మకూరురూరల్ : క్షేత్రస్థాయిలో సంపూర్ణ అభివృద్ధి లక్ష్య సాధనే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పాటుపడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక పరిశీలకుడు ఎ.రమేష్ అన్నారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు రెండు రోజుల శిక్షణా తరగతులకు మంగళవారం ఆయన హాజరై, మాట్లాడారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పలు కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులతో పాటు స్థానికంగా ఉన్న వనరులను వినియోగించుకోవాలని సూచించారు. డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణ, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని పరిశుభ్రతను కాపాడాలని, తద్వారా ప్రజారోగ్యం పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డేవిడ్, ఏఓ శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం హరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేశవ నారాయణమ్మ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఖాదర్‌మస్తాన్, సుదర్శన్ పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

చేజర్ల : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితిపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ఐఆర్డీ పీఆర్ రాష్ట్ర పరిశీలకుడు రమేష్ అన్నారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని, మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు దోహదపడాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత, ఈఓపీఆర్డీ రామయ్య, డీఎల్‌పీఓ నారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

సీతారామపురం : గ్రామాల్లో సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన మంగళవారం పాల్గొని, మాట్లాడారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భార్గవి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ఉదయగిరి : సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల సుస్థిరాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీఓ అప్పాజీ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీల సుస్థిరాభివృద్ధి, లక్ష్యసాధనపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, వైస్ ఎంపీపీ మట్ల శాంతి, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, ఏపీఎం ఖాజారంతుల్లా, ఈఓపీఆర్డీ కరిముల్లా పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

వరికుంటపాడు : మండలంలోని తూర్పు రొంపిదొడ్ల సచివాలయ ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ పి.హేమంత్‌కుమార్ పాల్గొని, అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ యశ్వంత్, సర్వేయర్ విష్ణు పాల్గొన్నారు.

- **సీతారామపురం :** మండలంలోని మారంరెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 54 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు, భూ ఆక్రమణలు, భూ విస్తీర్ణంలో తేడాలు, సాదాబైనామా, వెబ్‌ల్యాండ్‌లో పేర్ల మార్పులు, తదితర వాటి కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీఆర్వో ఖాజామొహిద్దీన్, సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.
- **కలిగిరి :** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తామని తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు తెలిపారు. కలిగిరిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై 55 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ దివ్య, వీఆర్వోలు చిన్నరాజ్యం, చెన్నయ్య పాల్గొన్నారు.
- **ఆత్మకూరురూరల్ :** మండలంలోని కరటంపాడు, ఆరవేడు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ స్వరూప్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లో 49 వినతి పత్రాలు వచ్చాయని తెలిపారు. సర్పంచ్‌లు రేవతి, ప్రసాద్‌రెడ్డి, వీఆర్వో చిన్నమ్మ, స్థానిక నాయకులు వేణు గోపాల్ నాయుడు, దావా పెంచలరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- **చేజర్ల :** మండలంలోని బిల్లుపాడు, కాలేయపాళెం ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఐదు అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దార్ మస్తానయ్య తెలిపారు.

గ్రావెల్ మాఫియాపై చర్యలు చేపట్టాలి



సీతారామపురం : మారంరెడ్డిపల్లి పంచాయతీలో గ్రావెల్ మాఫియాపై చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం పలువురు స్థానికులు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, అమ్మకాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు ప్రతాప్‌రెడ్డి, దళిత, గిరిజన ఐక్యవేదిక నాయకుడు ఎలీషాకుమార్, కరుణాకర్ రెడ్డి, నాగయ్య ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కావలి : నియోజకవర్గంలో ప్రధానంగా బంగినపల్లి, తోతాపురి, చిన్న రసం, పెద్ద రసం రకాల మామిడి సాగులో ఉన్నాయని, చలి ప్రభావం ఉన్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కావలి ఉద్యానాధికారి ఎం.సుధామయి చెప్పారు. మండలంలోని ఆనమడుగు గ్రామంలో మామిడి తోటలను రైతులతో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. మామిడి పూత డిసెంబర్, జనవరి నెలల్లో మొదలై ఫిబ్రవరి వరకు ఉంటుందన్నారు. మామిడిలో పూత ఒకేసారి రాదని, దీనివల్ల సస్యరక్షణ చర్యలు చేపట్టడంలో, కోత కోయడంలో ఇబ్బందులు ఉంటాయని చెప్పారు. డిసెంబర్‌లో చలితీవ్రత వల్ల మొగ్గలు రావడం ఆలస్యమవుతుందని, ఇలాంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



తోటలను పరిశీలిస్తున్న ఉద్యానాధికారి సుధామయి